


ఎస్‌డివి అజీజ్

నవల పూర్తిచేసి సంతృప్తిగా నిట్టూర్చి టేబుల్ ముందు నుంచి పైకి లేచాను. 200 పేజీల నవల. రెండు నెలల నుంచి కూర్చోని కష్టపడి వ్రాసిన నవల. నవలల పోటీకోసం వ్రాసిన నవల. మానవ సంబంధాలను విశ్లేషిస్తూ వ్రాసిన నవల. సిగరెట్ వెలిగించి ఈజీ చైర్లో వాలిపోయాను. రెండు నెలలుగా సాయంకాలాలు బయటికి వెళ్ళటంలేదు. ఆఫీసునుంచి రావటం రాత్రి పదింటివరకు వ్రాస్తూ కూర్చోవటం. పట్టుదలగా కూర్చొని నవల పూర్తిచేశాను. ప్రసవ వేదననుంచి బయటపడ్డ అనుభూతి. అనుకొన్న ప్రకారంగానే నవల సంతృప్తికరంగా ముగిసింది. నవల పంపడానికింకా ఓ పదిరోజుల గడువుంది. ఈలోపు ఓమారు నవలంతా తిప్పేసి ఏవైనా అక్షర దోషాలు వుంటే సరిచేసుకోవాలి. అలా బయటికి వెళ్ళి రావాలనిపించింది. ఎక్కడికెళ్ళాలి? ప్రసాద్ గుర్తొచ్చాడు. నాకున్న సాహితీ మిత్రుల్లో ప్రసాద్ ఒకడు. ఈజీ చైర్లో నుంచి లేచి వెళ్ళి ముఖం కడుక్కొని, డ్రస్సు మార్చుకొని బయటికి అడుగులు వేస్తుండగా అంది నా శ్రీమతి.

"బజారుకెళ్తున్నట్టున్నారు. వచ్చేప్పుడు కూరగాయలు పట్టుకురండి!"

"నావల్లకాదు"

"మీవల్ల ఏమౌతుందని..."

"తెలిసి మళ్ళీ అడగటం దేనికి?"

అనేసి ఇల్లు దాటి బయటికి వచ్చాను. రోడ్డుపైకొచ్చి ఆటో ఎక్కి నేరుగా పాత బస్టాండ్‌లో దిగాను. అలవాటు ప్రకారంగా గౌడ్ కిళ్ళీకొట్టుదగ్గరికి వెళ్ళి సిగరెట్ ప్యాక్ కొన్నాను.

"ఈమధ్య ఇటు రావటం లేదేంటి సార్?"అంటూ నేనిచ్చిన వంద రూపాయల్లో ముప్ఫయి రూపాయలు పట్టుకుని డెబ్బై వెనక్కు ఇచ్చాడు.

"కాస్త పనుండి రాలేకపోయాను"అంటూ కొన్న ప్యాకెట్‌నుంచి ఓ సిగరెట్ తీసి వెలిగించాను. సంవత్సరాల తరబడి చూస్తున్న ప్రాంతమయినా, ఇన్నెళ్ళ తర్వాత వచ్చినందుకు అంతా కొత్తగా అగుపడింది. కొంత దూరం నడిచి గురుస్వామి పబ్లిక్‌బూత్ వద్దకు వెళ్ళాను.

"బాగున్నారా? విష్ చేశాడు గురుస్వామి."

"ఆ... బాగున్నాను" అంటూ అక్కడ్నుంచి ప్రసాద్ ఇంటికి ఫోన్ చేశాను. ప్రసాద్ లైన్లోకొచ్చాడు.

"గురుస్వామి బూత్ దగ్గర్నుంచి, వస్తావా?" అడిగాను.

"పది నిముషాల్లో వస్తాను" ప్రసాద్ జవాబు.

"సరే!! అంటూ ఫోన్ పెట్టేసి- ఓ రెండ్రూపాయలు గురుస్వామికి ఇస్తూ అడిగాను. "ఈమధ్య ఏవైనా నాటకాలు".

"నందికి ప్రిపేర్ అవుతున్నాం! ఏదైనా ఓ మంచి నాటకం వ్రాసివ్వండి!"

"ప్రిపేర్ అవుతున్నామన్నారు?"

"కొత్త నాటకాలు లేక పాతదే రిహార్సల్ చేస్తున్నాం. రిహార్సల్ మొదలు పెట్టి కూడా రెండ్రోజులే అవుతోంది. మీరు నాటకం ఇచ్చారంటే దాన్నే ప్రాక్టీస్ చేస్తాం!"

"ప్రస్తుతానికి నావద్ద నాటకాలేం లేవు. ఈసారి వ్రాసినప్పుడు ఇస్తాను" అంటూ అతనితో కాసేపు మాటామంతి సాగిస్తుండగా ప్రసాద్ వచ్చాడు. ఇద్దరం దగ్గర్లోని మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లోకెళ్ళి కూర్చున్నాం! కళాకారులకు ఆ థియేటర్ ఓ అసెంబ్లీ లాంటిది. కళలకు సంబంధించిన నిర్ణయాలు అక్కడే జరుగుతూ వుంటాయి.

"నవల పూర్తయ్యిందా?" అడిగాడు ప్రసాద్. అతనికి నేను నవల వ్రాస్తున్న విషయం తెలుసు. "ఈవాళే పూర్తయ్యింది"అంటూ నేనూ సిగరెట్ వెలిగించి అతనికొకటి ఆఫర్ చేశాను.

"టూకీగా కథ చెప్పు!"

అతను టూకీగా. చెప్పమంటే నేను నాలో వుండే ఉత్సాహంకొద్దీ ఓ గంటపాటు వివరంగా సీన్ టు సీన్ ఎండింగ్ వరకూ చెప్పుకొచ్చాను. నేను చెప్పింది విన్న ప్రసాద్ ఆలోచనలో పడుతూ అన్నాడు.

"సబ్జెక్ట్ బాగుంది. నువ్వు వ్రాసిన విధానం కూడా బాగానే వుంటుంది. ఎండింగ్ మాత్రం చెప్పుకోదగ్గదిగా లేదు."

"ఎలా వుండాలంటావు?" అడిగాను.

"ఎండింగ్ న్యాచురల్‌గా, రియాలిటీకి దగ్గరగా వుండాలి."

"ఎలా?"

మామధ్య చర్చ మొదలయ్యింది. ఆ చర్చ దాదాపు రెండు గంటలసేపు కొనసాగింది. చివరికి హీరో, హీరోయిన్ను వొదిలేసి వెళ్ళడమే మంచిది' అన్న నిర్ణయానికి వచ్చాం.

"ఈరోజు రాత్రే మనం అనుకొన్న విధంగా ఎండింగ్ మార్పు చేస్తాను. టీ తాగుదామంటావా?"

"పద" లేచి నిలబడ్డాడు ప్రసాద్.

నేనూ లేచాను. ఇద్దరం ఆడిటోరియం బయటికి వచ్చి ఎదురుగా వున్న టీ స్టాల్లోకి దూరాం!

రవి అగుపించాడు.

నేనూ, ప్రసాద్ చూపుమరల్చాం!

నాకూ, ప్రసాద్‌కు అతనంటే పడదు. సాహిత్యకారులు సమాజానికి ఆదర్శవంతంగా వుండాలన్నది అతని అభిప్రాయం.రాతల్లోనే కాదు. చేతల్లో కూడా ఆదర్శం చూపాలన్నది అతని నైజం. తన మనోభావాలకు తగ్గట్టుగానే మతాంతర వివాహం చేసుకొన్నాడు. కలిసినప్పుడల్లా 'ఎందుకండీ హిపోక్రసీ జీవితం. మామూలు వ్యక్తుల్లా హిపోక్రసీ జీవితం గడుపుతూ ఆదర్శవంతమైన రచనలు చేయటుమంత ఆత్మద్రోహం మరొకటి వుండదు" అనేవాడు.

అతని మాటలకు నాకు మండుకొచ్చింది.

అయినా ఏమీ అనలేకపోయాను. కారణం? అతను నడుస్తున్న ఓ విజ్ఞాన గని. మంచి విమర్శకుడు. అతనితో వాదనకు దిగితే నాకే ప్రమాదం. అందుకే కోపం దిగమింగాను. అతన్నుంచి దూరంగా వుంటూ వస్తున్నాను. ఇక అతనంటే, ప్రసాద్‌కు ఎందుకు పడదంటే, ఇద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. ఆఫీసు వ్యవహారాల సంబంధంగా ఇద్దరి మధ్య గొడవలు వచ్చాయి. ప్రసాద్ అతనితో మాట్లాడ్డం మానేశాడు.

రవి మమ్మల్ని చూశాడు. దగ్గరికొచ్చి 'బాగున్నారా?'అంటూ నన్ను పలుకరించాడు. ప్రసాద్ వంక చూస్తూ అన్నాడు. "ప్రసాద్! జరిగిందేదో జరిగిపోయింది. జరిగిందాని గురించి మనసులో వుంచుకోకు."

ప్రసాద్ ఏం మాట్లాడలేదు.

"ఏం వ్రాస్తున్నారు?" ఇద్దరి వంక చూస్తూ అడిగాడు.

"ఏం వ్రాసినా నీలాంటి వాళ్ళు పనిగట్టుకుని విమర్శిస్తున్నప్పుడు వ్రాసేదేముంటుంది?" ప్రసాద్ పలుకుల్లో నిష్ఠూరం.

చిన్నగా ప్రసాద్ భుజం తట్టి చెప్పుకొచ్చాడు రవి.

"విమర్శ లేని రచన, కమిట్‌మెంట్ లేని జీవితం రాణించవు. రచయిత అన్నవాడికి దాదాపు అన్ని విషయాలపై స్థూలమైన అవగాహన వుంటుంది. ఆ అవగాహనే తన రచనల ద్వారా చెప్పే ప్రయత్నం చేస్తాడు. పాత్రల ద్వారా అలా నడవండి! ఇలా నడవండి' అంటూ ఉద్బోధ చేస్తాడు. ఆ ఉద్బోధను తాను మాత్రం పట్టించుకోడు. దీన్నే పలాయనవాదమంటారు. పలాయన వాది అయిన ఏ రచయిత కూడా నిజమైన రచయిత అనిపించుకోడు. మీరు నిజమైన రచయితలు అనిపించుకోవడానికి ప్రయత్నం చేయండి! రాబోయే చరిత్ర పుటల్లో స్థానం కల్పించుకోండి!" అంటూ టీ ఆర్డరిచ్చి, 'మేం టీ తాగాక, బిల్ పే చేసి' వస్తాను అంటూ వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయాక నేను నోరు విప్పాను.

"ఇతనేంటి? మనకు క్లాస్ తీసుకుంటాడు. మనం అంత వెర్రి వెధవల్లాగా అగుపిస్తున్నామా?"

"నాముందు చెప్పడం దేనికి? అతనిముందే చెప్పకపోయావా ఈమాట" నావంక చూస్తూ అన్నాడు ప్రసాద్.

"రానీ! అవకాశం రానీ! వచ్చినప్పుడు దులిపి పారేస్తాను. ఇంకోసారి మన జోలికి రాడు."

"నువ్వు దులిపినప్పటి మాట" నా మాటల్ని తేలిగ్గా కొట్టిపారేసేసరికి నిజంగానే నాకు మండుకొచ్చింది. అయినా నిగ్రహించుకొన్నాను. సమయం రాకపోతుందా? అనుకుని.

ఇద్దరం టీస్టాల్ నుంచి బయటికి వచ్చాము. ఇద్దరి మూడ్ డిస్టర్బ్ అయ్యింది. మాటలు పెద్దగా ముందుకు సాగలేదు. ఇద్దరం గుడ్‌నైట్ చెప్పుకుని చెరోదారి పట్టాం? ఇంటికొచ్చానన్న మాటేగాని, రవే కళ్ళముందు మెదలుతున్నాడు. రవి నోరు మూతపడేలా నిజ జీవితంలో నేనూ ఏదోఒకటి చేయాలనిపించింది. ఏం చెయ్యాలి? ఎంతగా ఆలోచించినా బుర్రకు తట్టలేదు. భోజనాలయ్యాక పక్కపై, నా పక్కన చేరుతూ నా శ్రీమతి అంది.

"అమ్మాయికి ఏదైనా ఓ మంచి సంబంధం చూడండి! ఈడొచ్చి ఉద్యోగం చేస్తోన్న ఆడపిల్లను ఇంకా ఎన్నాళ్ళని ఇంట్లోవుంచుకొంటాం?"

"తగిన సంబంధాలు దొరకాలిగా? చాలామందికి చెప్పివుంచాను. మ్యారేజీ బ్యూరోకి అమ్మాయి వివరాలు అందించాను."

"మీకు ఆఫీసు ఇల్లు తప్ప వేరేది పట్టదాయె! ఇలాగయితే, ఇంకో అయిదారేళ్ళు గడిచినా వివాహం చేయలేరు."

"నన్నేం చేయమంటావు?" విసుగ్గా అన్నాను.

ఆఫీస్‌కు సెలవుపెట్టి మంచి సంబంధాలకోసం వెతకండి! 'సరే చూద్దాం! అమ్మాయి ఏం చేస్తోంది?" నా శ్రీమతి అందించిన కిళ్ళీ నములుతూ అన్నాను.

"టి.వి. చూస్తోంది."

నా శ్రీమతిని పైకి లాక్కొన్నాను.

"దీనికి మాత్రం లోటురానివ్వరు. అమ్మాయి పడుకోనివ్వండి!" అంటూ దూరంగా జరిగింది. నాలో తెచ్చిపెట్టుకున్న ఆవేశం ఉత్సాహం చల్లారింది. పక్క దిగి ఈజీ చైర్లో వాలిపోయి సిగరెట్ వెలిగించాను. మళ్ళీ రవి కళ్ళముందు కదలాడాడు.

* * *

"నాన్నా!"

"ఏమ్మా?"ఆఫీసుకు వెళ్తొన్న కూతురిని చూస్తూ అన్నాను.

"సాయంకాలం మీరింట్లోనే వుంటారు కదా!"

"దేనికమ్మ?"

"మీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలి."

"ఇప్పుడు చెప్పొచ్చుగా!"

"ఆఫీసుకు వెళ్ళే టైం అయ్యింది. సాయంకాలం అయితే..."

"సరే నీ ఇష్టం!"

నా కూతురు వెళ్ళిపోయాక ఆలోచనలో పడ్డాను. ముఖ్య విషయం అంది. అంత ముఖ్య విషయం ఏమై వుంటుంది? నానా రకాల ఆలోచనలు. బుర్ర వేడెక్కిపోయింది. ఆ వేడెక్కిన బుర్రతోనే అరిచాను. "క్యారియర్ రెడినా?"

"ఆ రెడి" లోపల్నుంచీ నా శ్రీమతి సమాధానం.

నా గదిలోకి వెళ్ళి డ్రస్ మార్చుకొని వచ్చేలోపు నా శ్రీమతి క్యారియర్ నా చేతిలో పెట్టింది. నా కూతురు చెప్పబోయే ముఖ్య విషయం ఏమైవుంటుంది? అని నా శ్రీమతిని అడుగుదామనుకున్నాను. నాకంటే టెన్షన్ ఎక్కువ తనకు. పైగా బి.పి. 'వద్దులే' అనుకొని 'వస్తాను' అంటూ ఆఫీసుకు బయల్దేరాను. ఆఫీసు చేరాక, ఆ వాతావరణంలో నా కూతురు చెప్పబోయే ముఖ్య విషయాల గురించి, తాత్కాలికంగా మరచిపోయాను. లంచ్ అవర్లో క్యారియర్ విప్పుకొని భోం చేస్తున్నప్పుడు గుర్తుకొచ్చింది. కాసేపు ఆలోచించి, ఏమీ తట్టక, వొదిలేసి భోజనం పూర్తిచేసి వెళ్ళి సీట్లో కూర్చున్నాను.

కాలం భారంగా సాగుతున్నట్లనిపించింది.

ఫైళ్ళు చూడబుద్ధికాలేదు. లేచి క్యాంటీన్‌కెళ్ళి టీ తాగొచ్చి కూర్చున్నాను. నా పై ఆఫీసర్ తన గదిలోకి నన్ను పిలిచాడు. వెళ్ళాను. ఉదయం వుంచిన ఫైల్ నాపై విసిరి వేసి, రిపోర్టు ఇలా వ్రాశావేంటి? ఇంత ఎక్స్‌పీరియన్స్ వున్న నీవే ఇలా చేస్తే ఎలా?" బి.పి. పెరిగి నాపై ఎగిరాడు. కింద పడ్డ ఫైల్ తీసుకుని అందులో వున్న రిపోర్ట్ చూశాను. అందులో వున్న అంకెల్లో ఎంతో తేడా వుంది.

'సారీ సార్- మళ్ళీ కొత్త రిపోర్ట్ వ్రాసి రేపు ఇస్తాను"

"మళ్ళీ రేపెందుకు ఇప్పుడే తయారుచేసి ఇవ్వు."

"ఈరోజు కాస్త మైండ్ డిస్టర్బ్‌డ్‌గా వుంది సార్. అందుకే అంకెలు వేయటంలో పొరపాటు చేశాను.

"మనసు స్థిమితం లేకపోతే, సెలవుపెట్టి ఇంట్లో కూర్చోవాలి కాని, ఆఫీసుకొచ్చి తప్పుడు రిపోర్టులు వ్రాయరాదు.

"ఇంకెప్పుడు ఇలా జరగకుండా జాగ్రత్త పడతాను. రేపుదయమే ఫైల్ మీ టేబుల్‌పై పెడతాను."

'ఓ.కె. యుకెన్‌గో' బి.పి. కొంచెం తగ్గినట్టుంది. బతుకు జీవుడా అంటూ బయట పడ్డాను. సీట్లో కూర్చొనే ఓ రెండు గంటలపాటు ఇబ్బందిగా గడిపాను. ఆఫీసు గడియారం ఐదు గంటలు కొట్టగానే ఆఫీస్ ఫైళ్ళన్నీ టేబుల్ డ్రాయర్‌లో సర్దేసి ఆఫీసునుంచి బయటపడి ఆటో ఎక్కి ఇల్లు చేరుకొన్నాను. డ్రస్ మార్చుకొని కాఫీ తాగి సిగరెట్ వెలిగించాను. అరగంట గడిచాక అమ్మాయి వచ్చింది. వెంట ముప్ఫయేళ్ళు వున్న యువకుడు కూడా వున్నాడు.

"మా నాన్నగారు."

"నమస్తే సార్."

"నమస్తే" అన్నాను.

పక్కనే వున్న కుర్చీ చూపించాను. అతను కూర్చున్నాక అడిగాను.

"మీరూ?"

"నా పేరు ప్రదీప్. మీ అమ్మాయి పనిచేసే ఆఫీసులోనే క్లర్క్‌గా పనిచేస్తున్నాను."

"అలాగే!" నా కూతురు ఓమారు లోపలికెళ్ళి వచ్చింది. మాకు కాస్త దగ్గర్లో నిల్చొంది. అతను నా కూతురు వంక చూశాడు. 'చెప్పండి!' అన్నట్టు కళ్ళతోనే సైగ చేసింది.

"నాతో ఏదైనా మాట్లాడాలా"

అవును అన్నట్టుగా తలాడించి చెప్పాడు.

"సార్! ఇలా డైరెక్ట్‌గా వచ్చి అడుగుతున్నందుకు మరోలా అనుకోకండి! మీ అమ్మాయి, నేనూ ఒకరికొకరం ఇష్టపడ్డాం! మా వాళ్ళు కూడా మీ అమ్మాయిని చూసి 'నీ ఇష్టం'అన్నారు. మరి మీరూ అంగీకరిస్తే?

విషయం పూర్తిగా అర్థమైపోయింది.

"మీదే కులం?" ఎగిసి వస్తోన్న కోపాన్ని అణుచుకొంటూ అడిగాను. చెప్పాడు. అణిచిపెట్టుకొన్న కోపం ఒక్కసారిగా తన్నుకొచ్చింది.

> **కొ**డదామనిపించింది. కాని ఎందుకనో కొట్టలేకపోయాను. దౌడ పళ్ళు నూరుతూ వాడి వంక చూశాను. వాడు చూపుమరల్చాడు. సాయంకాలానికే తిరిగి వెళ్ళిపోయాడు.

"కులం తక్కువ వెధవ! నీకు నా కూతురు కావాలట్రా... నన్నే వచ్చి అడగడానికి నీకెంత ధైర్యం! పోరా బయటికి" గట్టిగా అరిచాను.

'నాన్నా' నా కూతురు ఏదో చెప్పబోయింది. చెంప చెళ్ళుమనిపించాను. 'పో లోపలికి' గట్టిగా గదిమాను.

"మేమిద్దరం మేజర్స్‌ము. మా పెళ్ళిని ఎవ్వరూ ఆపలేరు. పెద్దలని, అందులోనూ పేరున్న రచయితలనీ; బ్రాడ్ అవుట్ లుక్ వుంటుందని మీతో చెప్పే మిమ్మల్ని ఒప్పించి పెళ్ళి చేసుకోవాలనే వచ్చాను. మీరు రచయిత అయివుండి కూడా ఈకాలంలో కూడా ఇంకా కులాలు, మతాలు అంటూ వేలాడుతున్నారంటే, మీ రచయితల వర్గానికే సిగ్గుచేటు" అంటూ వెళ్ళిపోయాడు. నా కూతురు అతని వెంట వెళ్ళబోయింది. గుడ్లురుమి చూశాను. భయంతో వెనక్కు తగ్గింది. ఆ రాత్రే నా మేనల్లుడికి ఫోన్ చేశాను. వెంటనే బయల్దేరి రమ్మని.

మర్నాడు ఉదయం మా అమ్మాయిచేత బలవంతంగా ఖాళీ పేపర్‌పై సంతకం చేయించి అది సెలవు చీటిగా మార్చి వాళ్ళ ఆఫీసుకు వెళ్ళి ఇచ్చొచ్చాను. బయటకు కదలనిచ్చావంటే నీ రక్తం కళ్ళజూస్తాను అని నా భార్యకు వార్నింగ్ ఇచ్చాను.

మధ్యాహ్నం సమయానికి నా మేనల్లుడు దిగాడు.

'ఏం జరిగింది మావయ్యా?' అంటూ అడిగాడు.

'వెంటనే నీకు మా అమ్మాయికి పెళ్ళిచేస్తాను' అన్నాను.

నా మేనల్లుడికి వెనుకాముందు ఎవ్వరూ లేరు కాబట్టి వున్నది నేనొక్కడ్ని కాబట్టి ఈ నిర్ణయం తీసుకొన్నాను.

"సారీ మావయ్యా! నిన్నే నా పెళ్ళయిపోయింది. మా బ్యాంక్‌లో పనిచేసే లలిత అనే ఆమెను రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నాను. ఈ విషయం ముందుగా మీకు తెలిస్తే ఒప్పుకోరని- ఇలా చేసుకోవలసి వచ్చింది.

"మరి నా కూతురు గతేమిటి?"

మీ అమ్మాయిని నాకిచ్చి చేస్తారని, నాకెప్పుడూ చెప్పలేదు. ఆమెకు నచ్చిన వాడికిచ్చి పెళ్ళిచేయండి! ఎంత తేలిగ్గా అనేశాడు.

"తనకు నచ్చిన వాడ్ని చేసుకొంటే మేమెందుకురా!"

"రోజులు మారాయి మావయ్యా. ఇంకా కులం, మతం అంటూ కూర్చుంటే, అమ్మాయిలకు, అబ్బాయిలకు సకాలంలో పెళ్ళిళ్ళు అవక వృద్ధ కన్యలుగా, వృద్ధ బ్రహ్మచారులుగా మిగిలిపోతారు."

కొడదామనిపించింది. కాని ఎందుకనో కొట్టలేకపోయాను. దౌడ పళ్ళు నూరుతూ వాడివంక చూశాను. వాడు చూపుమరల్చాడు. సాయంకాలానికే తిరిగి వెళ్ళిపోయాడు.

ఎంత కట్నమయినా సరే. అని వేరే సంబంధాలు చూడ్డం మొదలుపెట్టాను. ఏ ఒక్కటి కలిసి రాలేదు. జాతకం, గోత్రం లేకపోయినా ఫర్వాలేదు. నా కులం వాడయితే చాలనుకున్నాను. భార్య చచ్చినవాడు దొరికాడు. అయినా సిద్ధపడ్డాను. వారంరోజుల్లో పెళ్ళి అని నిర్ణయం తీసుకొన్నాము. ఆ హడావుడిలో వుండగా ఓరోజు ఉదయం నా ఇంటికి పోలీసులు వచ్చారు. 'ఎస్.పి. పిలుస్తున్నాడు రమ్మన్నారు' నా గుండెల్లో గుబులు. అయినా బయల్దేరాను. ఎస్.పి. నా వంక ఎగాదిగా చూస్తూ చెప్పాడు.

"ప్రదీప్ అన్న వ్యక్తి మీ గురించి నావద్దకు వచ్చి కంప్లయింట్ ఇచ్చాడు. మీ కూతుర్తో పెళ్ళికి అడ్డుకొంటున్నారని.

"నేనడ్డుకోక మరెవరు అడ్డుకొంటారు."

"వాళ్ళిద్దరు ప్రేమించుకొన్నారట!"

"అదంతా అబద్ధం."

నా కూతుర్ని వున్న పళంగా పిలిపించాడు ఎస్‌పి.

"అపద్ధం కాదు నిజం" అని చెప్పింది. ఇప్పుడేమంటారు అన్నట్టుగా నా వంక చూశారు ఎస్.పి. చూపు మరల్చాను.

"మర్యాదగా వారిద్దరికి పెళ్ళి జరిపించండి! లేకుంటే మేమే దగ్గరుండి వాళ్ళ పెళ్ళి చేస్తాం."

"నే నొప్పుకోను."

"మీ అంగీకారం ఎవరికి కావాలి. వాళ్లు మేజర్స్. ఇష్టపడిన వ్యక్తిని పెళ్ళి చేసుకునే అధికారం వాళ్ళకుంది. ఏమంటారు?"

"నాకున్న ఒక్కగానొక్క కూతురు చచ్చిందనుకొంటాను" అనేసి బయటికొచ్చాను. నా కూతురు నా వెంట రాలేదు. వెళ్ళిపోయింది. తను ఇష్టపడ్డ వాడి దగ్గరికి వెళ్ళిపోయింది. ఇంటికెళ్ళాక, నా భార్య జరిగింది విని ఏడుపు! ఆ ఏడుపు విని భరించలేక 'నోర్మూసుకో'అని గదమాయించాను.

మరుసటిరోజు ఉదయం ఆఫీసుకెళ్తుంటే రవి వచ్చాడు.

"సాయంకాలం సాహిత్య సమావేశముంది. మీరు తప్పక రావాలి" అంటూ పిలిచాడు.

"సారీ రాలేను" అన్నాను.

"ఆ సమావేశానికి మీరే ముఖ్యఅతిథి. తప్పక రావాలి. ప్లీజ్!" అర్థింపుగా పలికాడు.

"సరే"అంటూ తలూపాను.

సాయంకాలం ఆఫీసునుంచి వచ్చాక, ఏడుస్తూ కూర్చున్న నా భార్య వంక చూస్తూ అన్నాను.

"అది చచ్చిందనుకో! ఎంత ఏడ్చినా ప్రయోజనం లేనప్పుడు ఏడ్వటం ఎందుకు దండుగ".

"నాది కన్నకడుపండి!"

"అందుకే అలాంటి దాన్ని కన్నావు. ఒంటరిగా ఇంట్లో కూర్చొని ఏం ఏడుస్తావు కాని, రా వెళ్దాం"అంటూ నా శ్రీమతిని కూడా బయల్దేరతీశాను. మేం వెళ్ళేసరికి సమావేశం జరిగే లైబ్రరి నిండా జనం. అందులో తెలిసిన సాహితీ మిత్రులు చాలామంది వున్నారు. రవి నన్ను, నా శ్రీమతిని తీసుకెళ్ళి ముందువరుసలో కూర్చోబెట్టాడు.

మైక్ దగ్గరకు వెళ్ళి, "ఈ సమావేశానికి విచ్చేసిన మీ అందరికి కృతజ్ఞతలు. ప్రముఖ రచయిత అయిన పి.యస్.రావు గారిని వేదికపైకి రావలసిందిగా కోరుతున్నాను."

వెళ్ళి కూర్చున్నాను. "అలాగే వారి శ్రీమతిగారిని కూడా వేదిక పైకి రావలసిందిగా కోరుతున్నాను." నా శ్రీమతి వేదికపైకి ఎందుకో

(మిగతా 12వ పేజీలో)

# జపాన్ కథలు

-- సౌభాగ్య --

# మాయ- పుచ్చకాయ

వేసవి చివరి రోజుల్లో పది గుర్రపు బళ్ళలో 'పుచ్చకాయలు' వేసుకుని రైతులు 'యమటు' ప్రాంతం నించి రాజధాని నగరంలో అమ్మడానికి బయల్దేరారు. మధ్యాహ్నం దాకా ప్రయాణం సాగింది. 'ఉజి' ప్రాంతానికి ఉత్తర దిశకు చేరుకున్నారు. విశ్రాంతికోసం ఒక మహా వృక్షం నీడకు చేరారు. గుర్రాలకు గడ్డి వేశారు. వాళ్ళకు ఆకలి వేస్తూ వుంటే తలాఒక పుచ్చకాయ తీసుకుని కోసుకుని తినడం మొదలు పెట్టారు.

అంతలో ఒక ముసలతను కట్టె పట్టుకుని నడుచుకుంటూ వచ్చి తింటున్న రైతులకేసి ఆశగా చూశాడు. రైతులు అతన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఇక వుండబట్టలేక ఆ వృద్ధుడు 'అయ్యా! ఆకల్తో అల్లాడిపోతున్నాను. నాకొక పుచ్చకాయ ఇచ్చారంటే దేవుడు మిమ్మల్ని చల్లగా చూస్తాడు' అన్నాడు. వాళ్ళలో ఎవరికీ ముసలాయనపై దయ కలగలేదు. జాలి కలగలేదు.



ఆ పుచ్చకాయలన్నీ ఆ రైతులవే ఐనా వాళ్ళు దయ నటిస్తూ 'చూడు ముసలాయనా! నీకు ఒక కాయ ఇవ్వాలనే మాకుంది. కానీ ఏం చెయ్యమంటావో చెప్పు. ఇవన్నీ మా యజమాని మాకు లెక్కపెట్టి ఇచ్చాడు. మేము ఆయనకు లెక్కలు చెప్పాల్సి వుంటుంది' అన్నారు. 'మీరు చాలా సంకుచిత బుద్ధులు. దయలేని వాళ్ళు, ముసలివాడిపై మీకు కనికరం లేదు'అని వృద్ధుడు వాపోయాడు. రైతులు పుచ్చకాయలు తింటూ వృద్ధుణ్ణి చూసి నవ్వుతూ పుచ్చకాయ గింజలు నేలపై వుమ్మేశారు.

వృద్ధుడు రైతులు వుమ్మేసిన పుచ్చకాయ గింజల్ని ఒకటొకటిగా ఏరుకున్నాడు. అది చూసి రైతులు పగలబడి నవ్వారు. ముసలాయన ఆ గింజల్ని పిడికిట నిండుగా ఏరుకుని పిడికిలిని నుదుటికి ఆనించి కళ్ళు మూసుకుని మనసులో ఏదో అనుకుని ఆ గింజల్ని రైతులు చూస్తూ వుండగా ఎదురుగా వున్న మైదానం పైకి విసిరాడు. రైతులు ఆశ్చర్యంగా చూశారు. చూస్తూ వుండగానే చల్లిన పుచ్చగింజలు మొలకలెత్తి భూమి పొంగినట్లు పచ్చని తీగలు గుబుర్లుగుబుర్లుగా వ్యాపించి క్షణంలో పూలుపూచి కాయలు కాచి ఆ ప్రాంతమంతా పచ్చపచ్చగా పుచ్చకాయల్తో నిండిపోయింది.

రైతుల నోట మాట రాలేదు.

కళ్ళార్పకుండా అలాగే నిలబడిపోయారు.

వృద్ధుడు వేలకొద్దిగా వున్న ఎదురుగా కుప్పలు పోసినట్లున్న పుచ్చకాయల్లో ఒక కాయ తెంపుకుని పగలగొట్టి కడుపు నిండుగా తిని మూతి తుడుచుకున్నాడు.

రైతులదంతా చిత్రం గా చూశారు.

వృద్ధుడు మ్రాన్పడిపోయిన రైతుల వంక చూసి చూడండి. ఒక్క పుచ్చకాయ ఇమ్మంటే మీరివ్వలేదు. దేవుడిచ్చాడు. ఒక్కటేమిటి? వందలు వేలు ఇచ్చాడు. కానీ నాకు ఒకటే చాలు. సరే! ఇక నేను వెళుతున్నాను అని వాళ్ళకు కనిపించనంత దూరం వెళ్ళిపోయాడు.

రైతుల నోటమాట రాలేదు. 'ఎవరో మంత్రగాడు' అనుకున్నారు. ఇక బయల్దేరాల్సిన సమయమైంది. గుర్రాలను బళ్ళకు కడదాం అనుకుని బళ్ళ దగ్గరకు వెళితే బళ్ళలో ఒక పుచ్చకాయ కూడా లేదు. బళ్ళన్నీ ఖాళీగా వున్నాయి. ఎదురుగా చూస్తే ముసలాడు సృష్టించిన పుచ్చకాయల పాదలన్నీ మాయమైపోయాయి. మైదానం బోసిపోయి, వెక్కిరిస్తూ కనిపించింది.

మాయతో ముసలాడు తమను మోసం చేశాడని రైతులు నెత్తీనోరూ బాదుకున్నారు. ★

ముసలాయన గింజల్ని పిడికిట నిండుగా ఏరుకుని పిడికిలిని నుదుటికి ఆనించి కళ్ళు మూసుకుని మనసులో ఏదో అనుకుని ఆ గింజల్ని రైతులు చూస్తూ వుండగా ఎదురుగా వున్న మైదానంపైకి విసిరాడు. రైతులు ఆశ్చర్యంగా చూశారు. చూస్తూ వుండగానే చల్లిన పుచ్చగింజలు మొలకలెత్తి భూమి పొంగినట్లు పచ్చని తీగలు గుబుర్లుగుబుర్లుగా వ్యాపించి క్షణంలో పూలుపూచి కాయలు కాచి ఆ ప్రాంతమంతా పచ్చపచ్చగా పుచ్చకాయల్తో నిండిపోయింది.

(9వ పేజీ తరువాయి)

నాకర్థం కాలేదు. రావాలా? వద్దా? అన్నట్టుగా నా శ్రీమతి నావంక చూసింది.

'వచ్చెయ్!' కళ్ళతోనే చెప్పాను.

లేచివచ్చి వేదికపై కూర్చుంది. తర్వాత జిల్లా రచయితల సంఘం ప్రెసిడెంట్‌ను, ప్రసాద్‌ను వేదికపైకి పిలిచాడు.

"ఈనాటి సమావేశానికి ఓ ప్రాముఖ్యత వుంది. అదేమిటో మీరే కాసేపట్లో చూడబోతారు. 'మిస్టర్ ప్రదీప్!' అంటూ పిలిచాడు. జనాల మధ్యనుంచి ప్రదీప్ లేచి వేదికపైకి వచ్చాడు. అంతమంది జనాల మధ్య అతను కూర్చుని వున్నాడన్న విషయం నేను గమనించలేదు. విషయమేమిటో లీలగా నాకర్థమయ్యింది. రవి వంక కోపంగా చూస్తూ లేవబోయాను.

"కూర్చోండి సార్" మైకు దగ్గర్నుంచే చెప్పాడు రవి.

ఆవేశాన్ని అణుచుకొంటూ కూర్చున్నాను.

"మిస్ మధురిమ వేదికపైకి రావాలని కోరుతున్నాను."

ఆడవాళ్ళ మధ్యన కూర్చున్న నా కూతురు లేచి వచ్చింది.

"నా ఆహ్వానాన్ని మన్నించి ఇక్కడికి విచ్చేసిన సాహితీ మిత్రులారా! సాహితీ రసజ్ఞులారా! నిజానికి ఈనాడు జరుగబోయేది సాహిత్య సమావేశం కాదు. ఓ ఆదర్శ వివాహం... ప్రదీప్, మధురిమ ప్రేమించుకొన్నారు. మీ అందరి ముందు దంపతులు కాబోతున్నారు. ఈ అమ్మాయి మన ప్రముఖ రచయిత పి.ఎస్.రావుగారి కూతురు. తమ రచనల్లో ఆదర్శం చూపినట్టుగానే, నిజ జీవితంలో కూడా మనందరికీ ఆదర్శర్శంగా నిలిచి వివాహం జరిపించబోతున్నారు. ఇప్పుడు, వీరిద్దరు దండలు మార్చుకొని దంపతులు అవుతారు" చప్పట్ల మోత.

నా నరనరాల్లో నా మనసు పొరల్లో ఎక్కించుకుని భద్రంగా కాపాడుకొస్తున్న కులం, మతం ఘోష.

వేదికపై వున్న దండలు తీసి వారి చేతికిచ్చాడు రవి. ఇద్దరు దండలు మార్చుకున్నారు. ఫ్లాష్ ఫొటోల మెరుపులు.

నా శ్రీమతి ఊపిరి బిగబట్టి చూస్తుండిపోయింది. ప్రసాద్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు వెంకట్రావ్ నావంక అభినందన పూర్వకంగా చూశారు. నాకు మండుతోన్న గాయంపై కారం చల్లినట్లుగావుంది.

"ఇప్పుడు ఈ దంపతులిద్దరూ నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు." మా వంక చూస్తూ అన్నాడు.

కుడితిలోపడ్డ ఎలుకలా మారింది నా పరిస్థితి. సాహసించి బయటికి పోలేను. పోతే! రేపు పత్రికలనిండా నా గురించి వార్తలే! వెళ్ళకపోతే- ఆత్మఘోష పెడుతుంది. ఏం చెయ్యాలో అర్థంకాలేదు.

"ఆశీర్వదించండి!" మరోమారు రవి పిలుపు.

కూర్చున్న స్థానంనుంచి లేచి వెళ్ళి ఆశీర్వదించాను. నా శ్రీమతి కూడా నాతోపాటు వేదికపై కూర్చున్న వారందరూ సంప్రదాయవాదులే! అయినా అవకాశం వచ్చింది కాబట్టి ఆదర్శ వివాహాల ఆవశ్యకతను గొప్పగా చెబుతూ అనర్గళంగా ఉపన్యసించారు. సమావేశం ముగిశాక వేదికపై నుంచి క్రిందికి దిగుతుండగా చెప్పాడు రవి. "ప్రదీప్ నా మేనల్లుడు."

జనాల మధ్యకు రాగానే అందరూ నన్ను అభినందనలతో ముంచెత్తారు. నిజమైన రచయిత అంటే నేనేనని పొగిడారు. వారి స్పందనకు నా ప్రతిస్పందన పెదాలపైకి తెచ్చి పెట్టుకొన్న నవ్వు.

మర్నాడుదయం పేపర్లో... నా ఫొటో...నా గురించి పొగడ్తలు!

ఆ పొగడ్తకు గర్వపడాలో, నా కూతురు నామాట కాదని, నా కులం కాదని కులాంతర వివాహం చేసుకొన్నందుకు బాధపడాలో అర్థం కాలేదు. ★